క్లుప్తంగా

నేడు ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల సమావేశం

శాంతినగర్: ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోయిల్‌దిన్నె రోడ్డులోని స్థానిక కన్యకా పరమేశ్వరిదేవి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం ఉంటుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి దసరా నాటికి వంద ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



శాంతినగర్: సమృద్ధిగా వర్షాలు, ఆక్సిజన్ అవసరాల కోసం విరివిగా మొక్కలు నాటాలని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని వెంకట్రామనగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. చెట్లు ఎక్కువగా ఉంటేనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రూపారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహ ఊరేగింపు



కేటీదొడ్డి: మండల కేంద్రంలో శనివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణభగవానుడి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొలువుదీరి 8 రోజులు పూర్తి కావడంతో భక్తులు స్వామిని ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శరణప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొక్కంబావికి మరమ్మతు చేయండి



అయిజ: చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన బొక్కం బావి శిథిలమైందని, మరమ్మతు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పురాతన బొక్కం బావి పాడుబడి వాడుకోలేని స్థితికి చేరుకుందన్నారు. వెంటనే విని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ఇటిక్యాల: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దదిన్నే ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంటగదులు, తరగతి గదుల నిర్వహణ పనితీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల చేత చతుర్విధ ప్రక్రియలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

మల్దకల్: క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని అడవిరావల్‌చెర్వు, నేతువానిపల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల విద్యా బోధన ఉండాలని పేర్కొన్నారు.

కార్యదర్శులతో సమావేశం

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఎంపీడీఓ రాఘవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితా, పోలింగ్ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

ప్రత్యేక నిధులతో పనులు సాగేనా?

- వర్షాలు, వరద కారణంగా ప్రత్యేక ఫండ్ కేటాయింపు
- రోడ్లు బాగు చేయాలంటున్న ప్రజలు
- గతేడాది కూడా హామీలతోనే సరి



మానదొడ్డి ప్రధాన రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

రాజోళి: వర్షాలు, వరదల కారణంగా ఆయా గ్రామాల్లో జరిగే రోడ్లు, నష్టాలకు ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రత్యేక ఫండ్‌ను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గత వారంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలును ప్రభుత్వం విడుదల చేసే ఫండ్‌తోనైనా పరిష్కరిస్తారా లేదా అని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

నడక నరకప్రాయంగా

మండలంలో కోట్ల రూపాయలతో రోడ్లు బాగు చేస్తామని శిలాఫలకాలు ఏర్పాటు చేసినా.. నేటి వరకు కనీసం మట్టి కూడా వేయలేని దుస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా పచ్చర్ల, మాన్‌దొడ్డి, నసనూరు, చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. ఈ గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలంటే శాంతినగర్ మీదుగా దాదాపు 30 కి.మీ. ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

❖ మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్ల, పడమటి గార్లపాడు మీదుగా రాజోళి వరకు రోడ్డు వేయాల్సి ఉండగా కంకర పోసి వదిలేశారు. కంకర వేసి రెండేళ్లు దాటినా ఎలాంటి పనులు చేపట్టలేదు.

❖ పచ్చర్ల నుంచి రాజోళికి అశోక్‌నగర్, పెద్దతాండ్రపాడు మీదుగా లింక్ రోడ్డు సౌకర్యం ఉండగా అది ఆర్‌డీఎస్ కెనాల్ రోడ్డు కాగా కనీసం అడుగు తీసి వేయలేని పరిస్థితి.

❖ ముండ్లదిన్నె నుంచి రాజోళికి 3 కి.మీ.ల దూరంతో చేరుకునే లింక్ రోడ్డు బీటీ లేక వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతింది.

ప్రత్యేక ఫండ్ పైనే ఆశలు

వర్షాలు, వరద కారణంగా డెబ్బతిన్న రోడ్లకు ప్రత్యేక నిధుల ద్వారా పనులకు నిధులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం చెప్పడంతో ప్రజలు దానిపైనే ఆశలు పెట్టుకున్నారు. బీటీరోడ్లు మంజూరైన చోట ఏళ్ల తరబడి పనులు చేపట్టలేదని ప్రత్యేక ఫండ్‌తోనైనా రోడ్లకు కనీసం మరమ్మతు చేస్తే రాకపోకలు సాగుతాయని అంటున్నారు. అదే విధంగా లింక్ రోడ్లపైనా దృష్టి పెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తుమ్మిళ్ల మీదుగా రాజోళి వెళ్లే రోడ్డుపై ముళ్ల పొదలు

30 కి.మీలు వెళ్లాలి



మా గ్రామం నుంచి వెంకటాపురం, శాంతిగనర్ మీదుగా రాజోళికి వెళ్లాల్సి వస్తుంది. దీని కోసం 30 కి.మీ.ల మేర అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. అది కూడా గుంతలమయమై నరకప్రాయంగా మారింది.

– వహీద్, మాన్దొడ్డి

బురదలో ఇరుక్కుంటున్నాయి



మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్ల మీదుగా రాజోళికి వెళ్లే మార్గంలో బురదలో వాహనాలు ఇరుక్కుంటున్నాయి. బీటీ రోడ్లు వేయడానికే ముందే ప్రస్తుతం వచ్చే ఫండ్‌తో రోడ్లకు మరమ్మతు చేస్తే ప్రయాణం సులువుగా మారుతుంది.

– రాఘవేంద్ర గౌడ్, మాన్దొడ్డి

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా మండల పరిధిలోని రోడ్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో పంచాయతీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో వివరాలు తీసుకుంటున్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతాం.

– భాస్కర్, ఎంపీడీఓ రాజోళి

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి



అలంపూర్‌లో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న తపస్ సంఘ నాయకులు

అలంపూర్: ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి తపస్ రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ ధరణీషాకు తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని సంతోషించినట్లు తెలిపారు. కానీ ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలను ఆవిరి చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలో లాగానే జీఓ 28తో పాత విధానాన్ని అమలు చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో వంద రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తక్షణమే పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధు, నరేంద్ర, శ్రీధర్, రాజశేఖర్, వసంత కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మానవపాడు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఎంపీడీఓ కార్యాలయం, ఎమ్మార్వో కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్‌కు వినతి

గద్వాలటౌన్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్ సంతోష్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేష్, నాగరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, రత్నాకర్ రెడ్డి, నల్లారెడ్డి, వెంకటేష్, మహేందర్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు పరుశరాం, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, సంఘం సభ్యులు శ్రీనివాసులు, రమేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

ధరూరు: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీటీకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, రాజేష్, మోహన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

మల్దకల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఝాన్సీరాణికి వినతిపత్రం అందజేశారు. కుర్తిరావల్‌చెర్వు పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, బుచ్చన్న, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలే పునాది



మల్దకల్: చిన్నారుల విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలే గట్టి పునాదని సీడీపీఓ హేమలత అన్నారు. శనివారం మల్దకల్ రైతువేదికలో మల్దకల్, గట్టు, అయిజ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పిల్లల జీవితాల్లో ఆరేళ్లు చాలా కీలకమైనవన్నారు. ఈ దశలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ప్రేరణ, అనుభవాలు వారి భవిష్యత్‌కు సంపూర్ణ అభివృద్ధికి, వికాసానికి పునాది వేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను నేర్చుకున్న పిల్లలకు బయటి పిల్లలకు చాలా వ్యత్యాసం ఉంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆకుకూరలు, పండ్ల విత్తనాలు పంపిణీ చేశారు. గట్టులోని 33 అంగన్‌వాడీ కేంద్రాలకు ట్యాబులు, సిమ్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, టీచర్లు పాల్గొన్నారు.

రైల్వే హాల్ట్ వద్ద బైక్ చోరీ

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే హాల్ట్‌లోని పార్కింగ్ ఏరియాలో పంచాయతీ కార్యదర్శి రవితేజ బైక్‌ను ఈ నెల 15న పార్క్ చేసి ఉద్యోగానికి వెళ్లాడు. తిరిగి వచ్చే చూసే సరికి బైక్ కనిపించ లేదు. ఈ క్రమంలో శనివారం బైక్ చోరీపై ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ పేర్కొన్నారు.

కొత్త ప్రయోగాల్లో పొరపాట్లు జరగొద్దు



గోపల్‌దిన్నేలో జలవనరులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి యోగానంద్

ఇటిక్యాల: పంటకోత ప్రయోగాల్లో పొరపాట్లకు తావివ్వొద్దని, సమగ్రంగా వివరాలు సేకరించి నిర్దేశిత యాప్‌లో(డీజీసీఈఎస్)లో నమోదు చేయాలని జిల్లా చీఫ్ ప్రోగ్రామింగ్ అధికారి యోగానంద్ అధికారులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో సిబ్బందితో కలిసి సందర్శించారు. 2023– 24 ప్రామాణికంగా చేపట్టబోయే 7వ చిన్నతరహా నీటి వనరుల గణన, 2వ వాటర్ బాడీస్ గణన గురించి మండల ప్రణాళిక గణాంక అధికారులకు ఫీల్డ్ ట్రైనింగ్ ఇచ్చారు. యాప్‌ల ద్వారా డేటా సేకరణ విధానం, పంటకోత ప్రయోగాల ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపగణాంక అధికారులు హరికృష్ణ, హైమావతి, జాకీర్ హుస్సేన్, మండల ప్రణాళిక అధికారులు శ్రీనివాసులు, మృదుల, వర్షిణి, మమత, ఏఈఓలు కవిత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు

అలంపూర్/రాజోళి: పట్టణంలోని పీఏసీఎస్ వద్ద మండలంలోని రైతులు యూరియా కోసం శనివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పీఏసీఎస్‌కు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాస్ పుస్తకానికి ఒక యూరి యా బస్తా మాత్రమే ఇస్తుండటంతో కొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

❖ రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి రైతువేదిక కిక్కిరిసింది. యూరియా కోసం పెద్ద ఎత్తున్న తరలిరావడంతో కొంత అవస్థలు పడ్డారు.



అలంపూర్ పీఏసీఎస్ వద్ద గుమిగూడిన రైతులు

సురవరం సేవలు మరువలేనివి



గద్వాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు



ఉండవెల్లిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల: పీడిత ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సురవరం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలతో ముందుకు నడిచాడని, తన తుదిశ్వాస వరకు తాను ఎంచుకున్న మార్గాన్ని వీడలేదన్నారు. స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో ఆయన చిత్రపటంతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ప్రభాకర్, ఆంజనేయులు, కుర్వపల్లయ్య, నర్సింహ, గోపాల్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల సంతాపం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీపీఎం నాయకులు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కేటీదొడ్డి: జీవితంలో విలువైన ఆస్తి చదువేనని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆయన సొంత గ్రామం చింతలకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా బుద్ధులు నేర్పిన పాఠశాలను ఎప్పుడు మరవొద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

జూనియర్ కళాశాల మంజూరు చేయాలి

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని బీజేపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, బీజేపీ నాయకులు అధికారులను కలిసి సమస్యలు విన్నవించారు. ప్రధాన రహదారులు బాగు చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పల్లె ప్రకృతి వనాల సంరక్షణ, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బూత్ అధ్యక్షుడు రాఘవేంద్ర, తిరుమలేష్, అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

అలంపూర్/అయిజ/మానవపాడు/శాంతినగర్/ఉండవెల్లి/ఎర్రవల్లి/కేటీదొడ్డి: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎస్‌ఐ వెంకటస్వామి అన్నారు. అలంపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం వినాయక చవితి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు నిబంధనల మేరకు పోలీస్ శాఖ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గణేష్ మండపాల బాధ్యత నిర్వాహకులదేనన్నారు. మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దలు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

❖ అయిజ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసరావు వివిధ సంఘాల, పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వినాయకచవితి ఉత్సవాలు, మీలాదున్ నబీ పండుగలను ఘర్షణకు తావు లేకుండా జరుపుకోవాలని కోరారు.

❖ మానవపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ టాటా బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

❖ గణేష్ నవరాత్రులు ఘర్షణలు లేకుండా జరుపుకోవాలని ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



అలంపూర్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటస్వామి

❖ ఉండవెల్లి మండలంలోని గణేష్ ఉత్సవాలు కులమత భేదం లేకుండా జరుపుకోవాలని ఎస్‌ఐ శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

❖ ప్రజలు శాంతి యుతంగా పండుగలు జరుపుకోవాలని ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ సూచించారు. స్థానిక పీఎస్‌లో గణేష్ ఉత్సవాలు, మిలాదున్ నబీ పండుగల నేపథ్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుధాకర్, వివిధ సంఘాల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

❖ వినాయక మండపాల కోసం పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



భక్తులతో రద్దీగా మారిన బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం



ఆదిశిలా క్షేత్రంలో బారులు తీరిన భక్తులు

మల్దకల్/గట్టు/కేటీదొడ్డి/ఎర్రవల్లి/రాజోళి/ధరూరు: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయంలో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అర్చకులు అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ సత్యచంద్రారెడ్డి, నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

❖ గట్టులోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృత అభిషేకం నిర్వహించారు. గట్టుకు చెందిన శశిరేఖ, వెంకటేష్‌చార్య దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు.

❖ కేటీదొడ్డి మండల పరిదిలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవ నిర్వహించారు.

❖ బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. అర్చకులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, ఆకుపూజ, అభిషేకం, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొనన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

❖ రాజోళి మండల కేంద్రం ఆయా గ్రామాల్లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట ఆంజనేయస్వామి ఆలయం, తుమ్మిళ్ల హనుమాన్ ఆలయంలో భజన, సంకీర్తలు ఆలపించారు.

❖ ధరూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.